క్లుప్తంగా

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రంను ప్రారంభిస్తున్న వై.ప్రదీప్‌రెడ్డి

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం చలివేంద్రం ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, ఈవో నాగరాజు తదితరులు ఉన్నారు.

అక్రిడిటేషన్ కమిటీలో ప్రాతినిధ్యం కల్పించాలి

ఆదోని అర్బన్ : జర్నలిస్టులకు అక్రిడిటేషన్ జారీచేసే కమిటీలో ఏపీడబ్ల్యూజేఎఫ్‌కు ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతూ ఆ సంఘం నాయకులు సోమవారం స్పందనలో సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఆ సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శులు బసవరాజ్, ఉరుకుందప్ప, విజయ్, మునెప్ప, సుధాకర్, రమేష్‌రెడ్డి, షంషేర్‌ఖాన్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేస్తున్న ఏపీడబ్ల్యూజేఎఫ్‌కు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు.

ఈరన్న స్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న ఈరన్నస్వామి

కౌతాళం: ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి దేవాలయానికి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. ఆలయంలో కొందరు భక్తులు తమ మొక్కుబడులను తీర్చుకునేందుకు ప్రత్యేక అభిషేకాలను చేపట్టారు. పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు.

పార్టీ గెలుపునకు కలసికట్టుగా పనిచేస్తాం

ఆదోని రూరల్: వైఎస్సార్‌సీపీకి సంబంధించి అంతర్గత విషయాలపై తమ గ్రూపులో నాయకులు, కార్యకర్తలతో చర్చించి అందుకు సంబంధించిన ఆడియోను నాయకులకు పంపించామని, ఈ ఆడియోను ఎవరో గిట్టని వారు లీక్ చేశారని ఆ పార్టీ జిల్లా సాంస్కృతిక విభాగపు అధ్యక్షుడు ఎస్.గోపాల్‌రెడ్డి అన్నారు. ఈ ఆడియోను లేనిపోనివి జోడించి ఏబీఎన్ ఛానెల్ తమ పార్టీపై బురద జల్లే ప్రయత్నం చేస్తోందన్నారు. తమ పార్టీ పట్ల, తమ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్ల ఉన్న గౌరవాన్ని తామెందుకు బహిరంగం చేస్తామని చెప్పారు. ప్రాణం ఉన్నంతవరకు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కోసం పని చేస్తానని చెప్పారు. సమావేశంలో ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు కల్లుపోతుల సురేష్, ఎస్సీ సెల్ పట్టణ కార్యదర్శి పరిగల నారాయణ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు



వినతిపత్రం స్వీకరిస్తున్న కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

ఆదోని టౌన్ : ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన పది మంది దాకా సమస్యల పరిష్కారం కోరుతూ దరఖాస్తులను చేసుకున్నారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు కల్లుపోతుల సురేష్, కోదండ, రామాంజనేయులు, సాయిరామ్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి

ఆదోని అర్బన్ : మండల విద్యాశాఖ కార్యాలయాల్లో పనిచేసే సిబ్బందికి వేతనాలు పెంచాలని సోమవారం నిరసన తెలియజేశారు. మధ్యాహ్నం భోజన విరామసమయంలో సమగ్రశిక్షలోని మండల విద్యాశాఖ కార్యాలయాల్లో మెసెంజర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, సీఆర్పీలు, అకౌంటెంట్, ఐఈ కో ఆర్డినేటర్ తదితర సిబ్బంది నిరసనలో పాల్గొన్నారు.

మినరల్ కాదు.. జనరల్

- నిబంధనలకు విరుద్ధంగా వెలుస్తున్న వాటర్ ప్లాంట్లు
- నామమాత్రం శుద్ధి చేసి ప్రజలకు విక్రయిస్తున్న వైనం
- ఒక్కో క్యాన్ రూ.15 నుంచి రూ.20 వరకు విక్రయం
- పట్టించుకోని అధికారులు



కోసిగిలో ఆటోలో క్యాన్‌లలో నీటిని సరఫరా చేస్తున్న దృశ్యం

కోసిగి: ప్రస్తుతం ప్రతి ఇంటా పట్టణ, గ్రామీణ ప్రాంతాలు తేడా లేకుండా మినరల్ వాటర్‌కు తాగేందుకు అలవాటు పడ్డారు. వేసవి కాలం ప్రారంభం కావడంతో మినర్ వాటర్ వాడకం ఎక్కువయ్యింది. ఇదే ఆసరా తీసుకున్న వ్యాపారులు మినరల్ వాటర్ పేరుతో జనరల్ వాటర్‌ను సరఫరా చేసి సొమ్ము చేసుకుంటున్నారు.

నామమాత్రంగా శుద్ధి

మంత్రాలయం నియోజకవర్గంలో కోసిగి, కౌతాళం, మంత్రాలయం, పెద్దకడబూరు మండల కేంద్రాలతో పాటు గ్రామీణ ప్రాంతాలలో 15 దాకా వాటర్ ప్లాంట్స్ వెలిశాయి. వీటి నిర్వాహకులు నీటిని నామమాత్రంగా శుద్ధ చేసి ప్రజలకు నేరుగా సరఫరా చేస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. వాటర్ ప్లాంట్లకు పంచాయతీ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేవు. కెమికల్స్ కలిపిన నీటిని క్యాన్లలో నింపి ఒక్కో క్యాన్‌ను రూ.15 నుంచి రూ.20 వరకు విక్రయించి జేబులు నింపుకుంటున్నారు. అలాగే వాటర్ ప్యాకెట్లు కూడా స్థానికంగా తయారు చేస్తూ ఐఎస్‌ఐ గుర్తింపు లేకుండానే తమ సొంత బ్రాండ్ పేరుతో ఒక్కో సంచి రూ.50 నుంచి రూ.70 వరకు దుకాణాలకు అమ్ముతున్నారు. దుకాణదారులు వాటిని ఫ్రిజ్‌లో కూలింగ్ పెట్టి ఒక్కో ప్యాకెట్‌ను రూ.2 లకు విక్రయిస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి..

నిబంధనలకు నీళ్లు

ఆర్వో ప్లాంట్స్ ఏర్పాటు చేయాలంటే సంబంధిత గ్రామ పంచాయతీ నుంచి అనుమతితో పాటు ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి. ఆర్వోకు అనుమతి ఇచ్చిన వివరాలు సంబంధిత గ్రామీణ నీటి సరఫరా అధికారులకు పంపాలి. మైక్రోబయాలజీ, కెమిస్ట్రీ నిపుణులు పరీక్షలు చేసిన తర్వాత ప్రజలకు నీటి సరఫరా చేసేందుకు అనుమతి లభిస్తుంది. నీటి సరఫరా డబ్బాలను రోజు శుభ్రం చేయాలి. నీటిలో లవణాలు, ఖనిజాలు, క్యాల్షియం, నైట్రేట్స్, పీహెచ్ శాతం 6.5 నుంచి 8.5శాతం ఉందో లేదో పరీక్షించాకా నీటిని విక్రయించాల్సి ఉంటుంది. 90 శాతం మేరకు నీటి శుద్ధి కేంద్రాలు కనీస ప్రమాణాలను పాటించడం లేదు. శుద్ధ చేయని నీటిని ఆటోల ద్వారా ఇంటింటికి వెళ్లి సరఫరా చేస్తున్నారు.

ప్యూరిఫైడ్ నీటిని సరఫరా చేయాలి



ప్రైవేట్ ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసుకున్న వారు తప్పనిసరిగా పంచాయతీ అనుమతి పొంది ఉండాలి. నీటిని శుద్ధి చేసిన తర్వాత ప్యూరిఫైడ్ వాటర్ మాత్రమే ప్రజలకు విక్రయించాలి. నీటిని శుద్ధి చేయకుండా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు. – రుద్రగౌడ, తహసీల్దార్

రాజగోపురానికి లక్ష విరాళం



దాతకు తీర్థప్రసాదాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయం వద్ద నిర్మిస్తున్న రాజగోపురానికి ఆదోనికి చెందిన సరోజమ్మ, రంగారెడ్డి దంపతులు రూ. 1,00,116 విరాళంగా అందజేశారు. ముందుగా వీరు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత దాతకు శాలువ పూలమాలతో సత్కరించి స్వామి వారి ఫొటో, శేషవస్త్రాలు, లడ్డు, ప్రసాదం అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రామాంజినేయులు తెలిపారు.

ప్యాసింజర్ రైలు పునరుద్ధరణ

ఆదోని అర్బన్ : రాయచూరు–గుంతకల్, గుంతకల్–రాయచూరు ప్యాసింజర్ రైలు ఈనెల 2వ తేదీ నుంచి పునఃప్రారంభమయ్యిందని ప్రభుత్వ ఆస్పత్రి సలహా సంఘం సభ్యుడు నసీరుద్దీన్ పటేల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నంబర్ 07800 రాయచూరు – గుంతకల్, 07799 గుంతకల్–రాయచూరు ప్యాసింజర్ గత నెల ఫిబ్రవరి 22వ తేదీ నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు రద్దు కావడం జరిగిందన్నారు. ఈనెల 2వ తేదీ నుంచి ఆ రైలును పునః ప్రారంభించారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీ మఠంలో ద్వాదశి వేడుకలు





బృందావన ప్రతిమకు బంగారు పల్లకీ సేవ, ప్రత్యేక అలంకరణలో స్వామి మూల బృందావనం

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో ద్వాదశి వేడుకలను పీఠాధిపతి శ్రీ సుబుధేంద్రతీర్థులు వైభవంగా నిర్వహించారు. సోమవారం తెల్లవారుజాము నుంచి మూలబృందావనానికి నిర్మల్య విసర్జన, ఫల, పుష్ప, పంచామృతాభిషేకాలు జరిపించారు. మూలబృందావనాన్ని కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నుంచి తీసుకుని వచ్చిన ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. బృందావన ప్రతిమను బంగారు పల్లకీలో ఉంచి శ్రీ మఠం మాడ విధుల్లో ఉరేగించారు. రాత్రి ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులను చెక్క, వెండి, బంగారు, నవరత్న రథంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ముందుగా తుంగభద్ర నదిలో స్నానమాచరించి గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

ఏడబ్ల్యూ భూమిని పేద రైతులకు కేటాయించాలి

ఆదోని రూరల్ : కల్లుకుంటలోని ఏడబ్ల్యూ భూమిని పేద రైతులకు పంపిణీ చేయాలని సీపీఐ మండల కార్యదర్శి వీరేష్, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం నాయకులు గోపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సబ్‌కలెక్టర్ అభిషేక్ కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కల్లుకుంటలో భూ పోరాటం నిర్వహించి దాదాపు సంవత్సరం కావొస్తుందన్నారు. సమస్య ఇంకా పెండింగ్‌లోనే ఉంది. ఏ డబ్ల్యూ భూమిని కచ్చితంగా భూమిలేని రైతులకు ఇవ్వాలని, గతంలో పేద రైతులే సాగు చేసేవారన్నారు. మాజీ వీఆర్వో మహబూబ్ పటేల్ ఆ పేద రైతుల భూమిని ఆక్రమించి భూస్వామిగా ఉన్న లక్ష్మన్నకు అమ్ముకున్నాడని చెప్పారు. పెద్దకడబూరు తహసీల్దార్ కూడా లక్ష్మన్నవి ఫేక్ పట్టాలు అని తేల్చారన్నారు. కల్లుకుంటలో మాజీ వీఆర్వో మహబూబ్‌పటేల్ దాదాపు రెండు వందల ఎకరాల ప్రభుత్వ భూమిని అమ్ముకున్నాడని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజు, జాఫర్, పటేల్, మబ్బుఅంజిని, డోల హనుమంతు, తిక్కన్న, గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

హమాలీలకు ఉపాధి కల్పించండి

ఆదోని రూరల్ : సెంట్రల్ వేర్‌హౌస్ గోదాములో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు ఉపాధి కల్పించాలని సీఐటీయూ సీనియర్ నాయకులు భీమానందరెడ్డి, అధ్యక్ష కార్యదర్శులు తిప్పన్న, పీఎస్ గోపాల్, ఉపాధ్యక్షులు డి.లక్ష్మన్న కోరారు. ఈ మేరకు సోమవారం సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సెంట్రల్ వేర్‌హౌస్ గోదామును నమ్ముకుని చాలా సంవత్సరాల నుంచి దాదాపు 70 కుటుంబాలు జీవిస్తున్నాయన్నారు. అయితే కరోనా వచ్చినప్పుడు నుంచి గోదాములకు నిల్వ చేసే కాంట్రాక్టు సీడబ్ల్యూసీ కాకుండా ప్రైవేట్ గోదాములకు స్టాక్ పాయింట్‌గా నిర్వహిస్తున్నారని చెప్పారు. దీంతో 70 కుటుంబాలకు పనులు లేక రోడ్డున పడే పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో హమాలీలు కిష్టప్ప, అంజిని, దానప్ప, నాగరాజు, చంద్ర, రమేష్, మల్లి, లక్ష్మన్న, నాగరాజు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

- స్పందన అర్జీలను శనివారంలోపు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలి
- రీ సర్వే సమస్యలకు ప్రత్యేకమైన మొబైల్ మెజిస్ట్రేట్
- సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్



స్పందన కార్యక్రమంలో అధికారులకు సూచనలిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోని రూరల్ : స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తపరిచేలా చూడాలని ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. ఈ మేరకు సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ మండలంలోని ఆయా శాఖల అధికారులు సమస్యలను వారంలోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లకుండా చూడాలన్నారు. రీ సర్వేలో ఏదైనా సమస్యలు వస్తే సంవత్సరంలోపు ఆ మండలానికి సంబంధించి మొబైల్ మెజిస్ట్రేట్ లేదా రీ సర్వే ఉప తహసీల్దార్ అప్పీల్స్ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి గోవిందసింగ్, డీఎల్‌పీఓ నూర్జహాన్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, డిప్యూటీ తహసీల్దార్ రమాదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చేతన్‌ప్రియ, సీనియర్ సహాయకులు రామయ్య తదితరులు పాల్గొన్నారు.

మండలాల నుంచి వచ్చిన సమస్యల్లో కొన్ని

- పెద్దకడబూరు మండలం జాలవాడి గ్రామానికి చెందిన కుంబరి ఈరమ్మకు సంబంధించి సర్వేనంబర్ 260/బీలో ప్రభుత్వం వారు ప్లాట్ నంబర్ 18 కేటాయించారని, ప్రస్తుతం ప్రభుత్వం మంజూరు చేసినా ఆ ప్లాట్‌ను చూపించాలని అర్జీ సమర్పించుకున్నారు.
- ఆదోని పట్టణం మేథర్‌మజీద్ వీధికి చెందిన సిరాజ్‌అహ్మద్‌కు పర్వతాపురం గ్రామంలోని సర్వేనంబర్ 62/బీలో 82 సెంట్ల భూమి ఉంది. ప్రస్తుతం ఆ భూమి సరిహద్దుపై హైవోల్టేజ్ కరెంట్ తీగలు ఉన్నాయని, అగ్ని ప్రమాదం పొంచి ఉందని, కరెంట్ తీగలు మార్చాలని అర్జీ సమర్పించుకున్నారు.
- ఎమ్మిగనూరు పట్టణం ఎస్సీ కాలనీకి చెందిన బెంజోమెన్‌కు సంబంధించిన సర్వేనంబర్ 212/బీసీ3లో ఇంటి స్థలం 12.1/2''40 విస్తీర్ణం ఉందని, మాపెద్దల నుంచి సంక్రమించిన ఇంటి స్థలం వేరే వారు ఆక్రమించుకున్నారని, వెంటనే ఇంటి స్థలాన్ని సర్వే చేయించి హద్దులు చూపాలని అర్జీ సమర్పించుకున్నారు.
- ఆదోని మండలం మదిరె గ్రామానికి చెందిన కె.యల్లప్ప హొళగుంద మండలం నెరణికి గ్రామ పరిధిలోని సర్వేనంబర్ 13లో 4.77 ఎకరాలు, సర్వే నంబర్ 26సీలో 18 సెంట్ల భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అర్జీ సమర్పించుకున్నారు.
- ఆదోని పట్టణం సాయిబాబానగర్‌కు చెందిన ఉరుకుందప్పకు సంబంధిచి మండిగిరి గ్రామంలో సర్వేనంబర్ 260లో 2.32 ఎకరాలు, సర్వేనంబర్ 1.49 ఎకరాల భూమికి సంబంధించి ఆర్‌ఓఆర్ అడంగల్‌లో పేరు ఉన్న ఆన్‌లైన్‌లో పేరు నమోదు కాలేదని. కావునా ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేయాలని అర్జీ సమర్పించారు.

చలివేంద్రం ప్రారంభం

కోసిగి: మండల కేంద్రం కోసిగి పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు వై. సీతారామిరెడ్డి చేతుల మీదుగా సోమవారం ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ కుమారి అయ్యమ్మ, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌ల ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీ మోహన్ రెడ్డి, ఎంపీపీ ఈరన్న, మాణిక్య రాజు, వక్రాని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆదోని రూరల్ : మేజర్ పంచాయతీ మండిగిరి సచివాలయం–01 వద్ద సోమవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ గీతావాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి, మండిగిరి మాజీ సర్పంచ్ శేషిరెడ్డి దీనిని ప్రారంభించారు.

మహిళా సాధికారతే లక్ష్యంగా పాలన



పొదుపు మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేస్తున్న వై.సీతారామిరెడ్డి

- కోసిగి అభివృద్ధిపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు వై. సీతారామిరెడ్డి
- కోసిగిలో 3వ విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమం



సమావేశానికి హాజరైన పొదుపు మహిళలు

కోసిగి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళా సాధికారతే లక్ష్యంగా పరిపాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు వై. సీతారామిరెడ్డి అన్నారు. సోమవారం కోసిగి వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో మేజర్ గ్రామ సర్పంచ్ కుమారి అయ్యమ్మ అధ్యక్షతన, ఏపీఎం సత్యమ్మ ఆధ్వర్యంలో వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డితో కలిసి నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజల్వన చేశారు. సీఎం జగనన్న చిత్ర పటానికి పొదుపు మహిళలతో కలిసి క్షీరాభిషేకం చేశారు. కోసిగి మండలంలో మూడవ విడుత వైఎస్సార్ ఆసరా పథకం కింద 869 గ్రూపులకు రూ.5.35కోట్ల చెక్కును అందజేశారు. ఆయన మాట్లాడుతూ నాడు చంద్రబాబు నాయుడు పొదుపు మహిళలను నట్టేట ముంచాడన్నారు. అదే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం 2019 ఎన్నికల నాటికి ఎంత మొత్తంగా బ్యాంక్ రుణాలు ఉన్నాయో వాటిని నాలుగు విడుతల్లో బ్యాంక్ ఖాతాల్లో జమచేస్తామని చెప్పాడన్నారు. ఇచ్చిన మాట తప్పకుండా ఇప్పటి వరకు మూడు విడుతలుగా ఆసరా నగదును పొదుపు మహిళల ఖాతాల్లో జమ చేసిన ఘన సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు.

పులికనుమ నుంచి త్వరలో నీటి సరఫరా

ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి కోసిగి పై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. పులికనుమ ప్రాజెక్ట్ నుంచి తాగు, సాగునీటిని త్వరలో అందుతోందన్నారు. ప్రతి వాడ వాడల డ్రైనేజీలు, సీసీ రోడ్డులు వేయించి అభివృద్ధి చేసి చూపించాడన్నారు. రాబోవు 2024 ఎన్నికల్లో ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డిని నాల్గవ సారి అత్యధిక మెజార్టీతో గెలిపించి సీఎం జగన్ మోహన్ రెడ్డికి కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ జనార్దన్, ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ పవిత్ర పాటిల్, వైఎస్ ఎంపీపీ మాన్వి లక్ష్మీ, పార్టీ సీనియర్ నాయకుడు నాడుగేని నరసింహులు, మండల కన్వీనర్ బెట్టన గౌడ, ఐరన్‌గల్ శ్రీనివాస రెడ్డి, మహాంతేష్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన 'పది' పబ్లిక్ పరీక్షలు

- తొలి రోజు ప్రశాంతంగా పరీక్ష
- కొన్ని సెంటర్లలో వందశాతం హాజరు



ఆదోని నెహ్రూమెమోరియల్ హైస్కూల్ వద్ద వేచి ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రులు



కౌతాళంలో విద్యార్థులను తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోనికి పంపుతున్న ఉపాధ్యాయులు

ఆదోని అర్బన్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పగడ్బందీగా చేపట్టడంతో పరీక్షలకు ప్రశాంతంగా జరిగాయి. కొన్ని సెంటర్లలో విద్యార్థులు వందకు వందశాతం హాజరయ్యారు. డివిజన్ పరిధిలో రెగ్యులర్ విద్యార్థులు 15,114 మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉండగా, 14,952 మంది పరీక్ష రాశారు. 162 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అదేవిధంగా సప్లిమెంటరీ విద్యార్థులు 475 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 343 మంది హాజరయ్యారు. 132 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం డివిజన్ పరిధిలో రెగ్యులర్, ప్రయివేట్ విద్యార్థులు 15,589 మంది హాజరవ్వాల్సి ఉండగా, 15,295 మంది హాజరయ్యారు. మొత్తం 294 మంది గైర్హాజరయ్యారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులతో అరగంట ముందే పరీక్షా కేంద్రాల వద్దకు వచ్చి హాల్‌టికెట్లను చూసుకుని వేచి ఉన్నారు. 8:45 గంటలకు విద్యార్థులను తరగతి గదిలోకి పంపించి, 9:30 గంటలకు పరీక్షలను ప్రారంభించారు. విద్యార్థులకు ఏ అనారోగ్యం సమస్య తలెత్తకుండా ప్రతి సెంటర్‌లో ఏఎన్ఎంలను ఏర్పాటు చేశారు. కొన్ని చోట్ల పరీక్షా కేంద్రాలకు వెళ్లేందుకు విద్యార్థులకు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు.

ప్రశాంతంగా పరీక్షలు

కౌతాళం: మొదటి రోజు పదోతరగతి పరీక్షలను విద్యార్థులు ప్రశాంతంగా రాశారు. మండలంలోని కౌతాళం, హల్వి, నదిచాగి, బాపురం, బదినేహాల్, ఏరిగేరి, కామవరం, కుంటనహాల్, ఉప్పరహాల్, రౌదూరు, చూడి పాఠశాలల నుంచి మొత్తం 776 మంది విద్యార్థులకు గాను 8మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాలేదని కౌతాళం జడ్పీ పాఠశాల హెచ్ఎం గౌరమ్మ తెలిపారు.

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, మౌంట్ కార్మెల్ పాఠశాలలో పదవ తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొదటి రోజున తెలుగు పరీక్షకు బాలుర ఉన్నత పాఠశాలలో 253 మందికి గానూ 251 మంది పరీక్ష హాజరయ్యారు. బాలికల ఉన్నత పాఠశాలలో 191 మందికి గానూరు 191 మంది పరీక్షలు రాశారు. మౌంట్ కార్మెల్ పాఠశాలలో 253 మందికి గానూరు 245 మంది విద్యార్థులు హాజరు కాగా 8 మంది గైర్హాజరయ్యారు.

పెద్దకడబూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల రెండు పాఠశాలల్లో పదవ తరగతి పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ పరీక్షా కేంద్రాలకు పెద్దకడబూరు మండల కేంద్రంతో పాటు చిన్నతుంబళం ఉన్నత పాఠశాల, హెచ్.మురవణి ఉన్నత పాఠశాల, కంబలదిన్న ఉన్నత పాఠశాల, ఆదోని మండలం దొడ్డనగేరి గ్రామ ఉన్నత పాఠశాల విద్యార్థులు పరీక్షలకు హాజరు అయ్యారు. ఉన్నత పాఠశాలలో 204మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా ఇద్దరు గైర్హాజరయ్యారు. ఆదర్శ పాఠశాలలో 260 మందికి గాను 256 మంది పరీక్ష రాశారు. పరీక్షలలో విద్యార్థులు ఎలాంటి మాల్ ప్రాక్టిస్‌కు పాల్పడకుండా సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టారు.

పది పరీక్షలకు 7 మంది గైర్హాజరు

మంత్రాలయం రూరల్: పది పరీక్షలకు 7 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు మండల విద్యాధికారి మోహీనుద్దీన్ తెలిపారు. మండల కేంద్రంలోని పరిమళ పాఠశాల, మాధవరం గ్రామంలోని సెయింట్ మార్తోమా పాఠశాలలో 802 మంది విద్యార్థులు హాజరు కావాల్సింది ఉండగా 795 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ వేణుగోపాల్‌రాజు, కిరణ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.



విద్యార్థులకు సూచనలిస్తున్న ఉపాధ్యాయుడు



పరీక్షా కేంద్రం వద్ద హాల్ టికెట్ నంబర్ చూసుకుంటున్న దృశ్యం



పరీక్షలు రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు

న్యాయం చేయండి

పెద్దకడబూరు : తమ పొలాన్ని అక్రమంగా కబ్జా చేశారని, చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలంటూ జాలవాడి గ్రామానికి చెందిన మణమ్మ సోమవారం స్పందన కార్యక్రమంలో అధికారులను ఆశ్రయించింది. తమ భర్త ప్రసంగి పేరుతో సర్వే నెంబర్ 2–2సి నందు 2.18ఎకరాల సీలింగ్ భూమి ఇచ్చిందన్నారు. అయితే తమ పక్క పొలం పక్కనున్న అయ్యప్ప తండ్రి పెద్దనాగప్ప నకిలీ అగ్రిమెంట్ సృష్టించి, ఆన్‌లైన్‌లో తన పేరు ఎక్కించుకున్నాడని వాపోయింది. ఈ విషయాన్ని గతంలో కలెక్టర్ దృష్టికి స్పందన కార్యక్రమం ద్వారా తీసుకెళ్లగా విచారణకు ఆదేశించడం జరిగిందన్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని న్యాయం చేయాలంటూ విన్నవించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఆదోని రూరల్ : మండలంలోని బైచిగేరి గ్రామ సమీపంలోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ఉన్న కొండల్లో పేకాట ఆడుతున్న పది మందిని అరెస్టు చేసినట్లు తాలూకా ఎస్ఐ గోపాల్‌రెడ్డి సోమవారం విలేకరులకు తెలిపారు. పెద్దకడబూరు మండలం చిన్నతుంబళం గ్రామానికి చెందిన భీరప్ప, వెంకటేష్, భీమన్నతో పాటు ఆదోని పట్టణంలోని కొడల్‌పేటకు చెందిన హనుమేష్, రఘుతో పాటు మరో ఐదుగురు పేకాట ఆడుతుండగా అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.1,56,500 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వెల్లడించారు.

శ్రీ మఠంలో ప్రముఖులు

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు గవర్నమెంట్ ప్లీడర్ కిశోర్‌కుమార్ సోమవారం రాత్రి మంత్రాలయం వచ్చారు. వీరు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం శ్రీ మఠంలో జరిగే రథోత్సవ సేవలో వారు పాల్గొన్నారు. ఈయనతో పాటు ఎస్ఐ వేణుగోపాల్‌రాజు తదితరులు ఉన్నారు.